ఆమరణ దీక్షను విరమించాలి



దయాకర్‌గౌడ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: గాంధీ ఆసుపత్రిలో నాలుగు రోజులుగా ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న ఓయూ విద్యార్థి మోతీలాల్‌ దీక్ష విరమించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్‌ శుక్రవారం కోరారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. పదేళ్ల పాలనపై విరక్తి చెందిన నిరుద్యోగులు గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి 18 గంటలు పని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్‌ నేతలు మరో మారు ఓయూ విద్యార్థుల త్యాగాలను వాడుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన కోరారు. త్వరలో జాబ్‌ క్యాలెండర్‌ విడుదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

సనత్‌నగర్‌: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై బేగంపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నివాసం ఉండే బాలిక (12) గురువారం మధ్యాహ్నం సమీపంలో ఉండే తమ బంధువుల ఇంటికి వెళ్లింది. సమీప బంధువైన యువకుడు (18) బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వీడియో కూడా తీశాడు. దీంతో భయపడిన బాలిక అరుస్తూ ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న బాలిక సోదరుడు నిందితుడి వద్దకు వెళ్లి అతని ఫోన్‌లో ఉన్న వీడియోలను పరిశీలించాడు. అనంతరం విషయాన్ని తల్లికి చెప్పాడు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన క్రైస్తవ సంఘాలు

లాలాపేట : తార్నాక డివిజన్‌ చర్చెస్‌ అసోసియేషన్‌ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు నూతన ఎస్‌హెచ్‌ఓ కరుణాకర్‌రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్‌ను అసోసియేషన్‌ నేతలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షులు రెవరెండ్‌ జి. సుదర్శన్‌, కార్యదర్శి బాల్‌రాజు, లీగల్‌ అడ్వయిజర్‌ అజరయ్య మనోహర్‌, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ జోసఫ్‌, అజరయ్య మోజెస్‌ పాల్గొన్నారు.

బోనాల జాతరకు నిధులు కేటాయించాలి

సికింద్రాబాద్‌ : సికింద్రాబాద్‌ నియోజకవర్గంలో అమ్మవారి బోనాల జాతర నిర్వహణలో భాగంగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.15 కోట్ల నిధులు కేటాయించాలని లష్కర్‌ జిల్లా సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌ కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు రూ.3 కోట్లు కేటాయించాలని కోరారు. లష్కర్‌ జిల్లా సాధన సమితి సభ్యులు మిట్టపల్లి బాబురావు, శైలేందర్‌, రవీంద్రసాగర్‌, కృష్ణ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక.. గంటలోనే అప్పగింత

రసూల్‌పురా : కార్ఖానా పీఎస్‌ పరిధిలోని మడ్‌ఫోర్ట్‌ హట్స్‌ నుంచి తప్పిపోయిన బాలిక ఆచూకీని సీసీ ఫుటేజీ ద్వారా పరిశీలించి గంటలోనే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. మడ్‌ఫోర్ట్‌ హట్స్‌లో నివసించే పవన్‌ కుమార్‌ కూతురు వైశాలి (5) మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో నుంచి నడుస్తూ బయటికి వెళ్లింది. అలా ట్యాంక్‌బండ్‌ వరకు చేరింది. చిన్నారి కనిపించడం లేదని తల్లిదండ్రులు సీఐకి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ.. ఎస్‌ఐ రవికుమార్‌ నేతృత్వంలో చిన్నారి ఆచూకీ కోసం బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ ట్యాంక్‌బండ్‌ వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న వైశాలిని తీసుకుని స్టేషన్‌కు తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు. పోలీస్‌ సిబ్బంది నవీన్‌, ప్రవీణ్‌ ఇతర సిబ్బందిని అభినందించారు.

సంఘ సేవకుడు చంద్రశేఖర్‌కు నంది అవార్డు

చిలకలగూడ : సంఘ సేవకుడు, ఎంసీఆర్‌ ప్రజాసేవ అధ్యక్షుడు మ్యాకల చంద్రశేఖరరావు నంది అవార్డు అందుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దశ వసంతాలను పురస్కరించుకుని నగరంలోని పలువురు సంఘ సేవకులు, సామాజిక కార్యకర్తలకు నంది అవార్డులు ప్రదానం చేసి సన్మానించారు. మెట్టుగూడ డివిజన్‌ దూద్‌బావికి చెందిన మ్యాకల చంద్రశేఖరరావు ఎంసీఆర్‌ ప్రజాసేవ పేరిట పలు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నంది అవార్డు అందించి ప్రోత్సహించిన కళా నిలయం నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ గురుకుల సీట్ల సంఖ్యను పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ : బీసీల జనాభాకు అనుగుణంగా గురుకుల పాఠశాలల సంఖ్య పెంచాలని గురుకుల కార్యదర్శి సైదులుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గురుకుల ప్రవేశాలకు బీసీ కులాలలోని వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే.. కొంత మందికే సీటు లభిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గుంటి మహేష్‌, నాగేందర్‌, కొండల్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

సుగుణకు డాక్టరేట్‌



ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ సోషియాలజీ విభాగం విద్యార్థిని ఎ.సుగుణకు పీహెచ్‌డీ డాక్టరేట్‌ డిగ్రీ లభించింది. శాతవాహన యూనివర్సిటీ అధ్యాపకురాలు డా.కె పద్మావతి పర్యవేక్షణలో తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర–సామాజిక పరిశీలన అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్‌ లభించింది. నాగర్‌కర్నూల్‌ జిల్లా తెలకపల్లి మండలం, కమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంకూరి పరశురాములు, పార్వతమ్మ దంపతుల నాల్గొవ సంతానం సుగుణ. ఆర్ట్స్‌ కాలేజీలో ఎంఏ చదువుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. ఏఐడీఎస్‌ఓ విద్యార్థి సంఘంలో ఆమె పని చేశారు.

విద్యుత్‌ అధికారుల తీరు మారదా?

లాలాపేట : తార్నాక మున్సిపల్‌ డివిజన్‌ పరిధిలో ఇటీవల కాలంలో లాలాగూడ విద్యుత్‌ అధికారుల వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్‌ సమస్యలపై కార్యాలయానికి వెళితే అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా లాలాపేట రోడ్డు విస్తరణలో కొందరు వ్యక్తులకు లాభం చేకూర్చేలా విద్యుత్‌ స్తంభాల తొలగింపు, కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శుక్రవారం లాలాపేటకు చెందిన కుమ్మరి ఆంజనేయులు, శివరామ్‌ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం 30 ఫీట్ల రోడ్డులో విద్యుత్‌ స్తంభాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా లాలాగూడ విద్యుత్‌ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కేవలం 10 ఫీట్ల రోడ్డులో స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి లాలాగూడ విద్యుత్‌ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌



బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్‌

రసూల్‌పురా : నియోజకవర్గంలో అర్హులైన పేదలకు పెన్షన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తానని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ హామీ ఇచ్చారు. శుక్రవారం రసూల్‌పురా శ్రీలంక బస్తీలో స్థానికులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బస్తీలో పర్యటించారు. వీధి దీపాలు, రోడ్ల సమస్య, తాగు నీటి, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పెన్షన్లు, రేషన్‌ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, కంటోన్మెంట్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. బస్తీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

కంటోన్మెంట్‌ : ఏళ్ల తరబడి ఉన్న శంకర్‌ నగర్‌ మురికి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడాది పొడవునా బస్తీలో మురుగునీరు ప్రవహించడం దారుణమన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఎల్‌. శంకర్‌ నగర్‌, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ లైనుపై అధికారులతో సర్వే చేయిస్తానన్నారు. అధికారులతో ప్రణాళిక రూపొందించి ప్రక్షాళన చేపడతామన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు బస్తీ వాసులు గిరిధర్‌, శంకరమ్మ, రాజన్న, పూలమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కంటోన్మెంట్‌ : నియోజకవర్గంలోని పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ తెలిపారు. శుక్రవారం మారేడుపల్లి నెహ్రూ నగర్‌ పార్కులో పర్యటించారు. స్థానిక నేతలు, వాకర్స్‌తో కలిసి పార్కు అంతా కలియ తిరిగి మొక్కలు నాటారు. అనంతరం సమీపంలో ఉన్న కుస్తీ పోటీల శిక్షణా భవనాన్ని పరిశీలించారు. పార్కుకు సంబంధించిన సమస్యలను సీనియర్‌ సిటిజన్స్‌ ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలోనే జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షించి ఆయా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బద్రీనాథ్‌ యాదవ్‌, సి. కృష్ణయాదవ్‌, శ్యాంసుందర్‌ రెడ్డి, సదానంద్‌ గౌడ్‌, సంతోష్‌ యాదవ్‌, వినోద్‌, జీహెచ్‌ఎంసీ ఏఈ రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఐజీ ఆరోమాసింగ్‌

అడ్డగుట్ట : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్‌సీఆర్‌ ప్రిన్సిపల్‌ చీఫ్‌ సెక్యూరిటీ కమిషనర్‌, ఐజీ ఆరోమాసింగ్‌ ఠాకూర్‌ అన్నారు. హైదరాబాద్‌ డివిజన్‌ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్‌ ఇంటర్‌ డివిజనల్‌ బ్యాడ్మింటన్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీలు సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్నాయి. ఇందులో హైదరాబాద్‌, సికింద్రాబాద్‌, హెడ్‌క్వార్టర్స్‌, విజయవాడ, గుంటూరు, గుంటకల్‌ మొత్తం ఆరు డివిజన్ల టీమ్‌లు పోటీ పడ్డాయి. మెన్స్‌ సింగిల్స్‌లో హెడ్‌ క్వార్టర్స్‌, మెన్స్‌ డబుల్స్‌లో గుంటకల్‌, మెన్స్‌ సింగిల్స్‌(45 సంవత్సరాల పైబడి), హెడ్‌ క్వార్టర్స్‌, మెన్స్‌ డబుల్స్‌(45 సంవత్సరాల పైబడి) గుంటకల్‌ డివిజన్‌ టీమ్‌లు గెలిచాయి. శుక్రవారం నిర్వహించిన ముగింపు వేడుకలకు ఆరోమాసింగ్‌ ఠాకూర్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు, రన్నరప్‌లకు ట్రోఫీలు, మెడల్స్‌ అందజేశారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట : కేంద్ర ప్రభుత్వం వెంటనే బొగ్గు గనుల వేలానికి జరిగే ప్రయత్నాలను మానుకోవాలని సీపీఎం సికింద్రాబాద్‌ జోన్‌ కన్వీనర్‌ అజయ్‌బాబు డిమాండ్‌ చేశారు. శుక్రవారం అడ్డగుట్ట చౌరస్తాలో సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తుందని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేటు సంస్థలతో వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్‌ కేంద్రంగానే వేలం పాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమన్నారు. సీపీఎం నాయకులు ఆర్‌. మల్లేష్‌, బాలయ్య, మహేందర్‌, గోపాల్‌, కృపాకర్‌, ఫాతిమా, యాకమ్మ, సరోజమ్మ, వజ్రా తదితరులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు

ఉస్మానియా యూనివర్సిటీ : అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను, విద్యార్థులను పట్టించుకోని మాజీ మంత్రి కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని విద్యార్థి నేతలు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఓయూ రీసెర్చ్‌ స్కాలర్‌ వలిగొండ నరసింహ మాట్లాడుతూ.. కేటీఆర్‌కు నిరుద్యోగులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. వ్యక్తిగత స్వార్థం కోసం ప్రజా ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు కొందరు నిరుద్యోగం పేరుతో చేస్తున్న రాజకీయాలకు ఓయూ విద్యార్థులు బలి కావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శంకర్‌ యాదవ్‌, వట్టికూటి అనిల్‌గౌడ్‌, ప్రవీణ్‌నాయక్‌, వై. అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్‌ అట్లాస్‌ విడుదల



లాలాపేట: జాతీయ పోషకాహార సంస్థ, ఐసీఎంఆర్‌ వివిధ జాతీయ సర్వేల ద్వారా సేకరించిన పోషకాహార సర్వేల డేటాను ఒకే ప్లాట్‌ ఫారమ్‌పై యాక్సెస్‌ చేసేలా రూపొందించిన న్యూట్రిషన్‌ అట్లాస్‌ను శుక్రవారం ఎన్‌ఐఎన్‌ విడుదల చేసింది. ఈ మేరకు ఎన్‌ఐఎన్‌ డైరెక్టర్‌ హేమలత నేతృత్వంలో డాక్టర్‌ సుబ్బారావు గవరవరపు శాస్త్రవేత్తల బృందం విభిన్న ప్రామాణికమైన పోషకాహార డేటాను సేకరించి ఈ వెబ్‌ అప్లికేషన్‌ను రూపొందించారు. దేశంలోని వివిధ సంస్థలు చేసిన పోషకాహార డేటా ఆరోగ్య ప్రొఫైల్‌ వివరాలతో పాటు వివిధ వయస్సుల వారు తీసుకునే పోషకాహార వివరాలు సైతం ఇందులో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ న్యూట్రిషన్‌ అట్లాస్‌ 2.0 స్టేట్‌ ఆఫ్‌ ది ఆర్ట్‌ స్టాండర్డ్‌ వెబ్‌ ఆధారిత డాష్‌బోర్డుగా రూపొందించినట్లు ఎన్‌ఐఎన్‌ అధికారులు తెలియజేశారు. దీని ద్వారా ప్రజలకు పోషకాహార విజ్ఞానం లభిస్తుందన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించండి



అధికారులతో కలిసి పెండింగ్‌ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్‌ : డివిజన్‌లో ఎన్నో రోజుల నుంచి పరిష్కారానికి నోచుకోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్‌ చీర సుచిత్ర అధికారులకు సూచించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్‌ ఉప కమిషనర్‌ సమ్మయ్య, ఈఈ సుదర్శన్‌, డీఈ సంతోష్‌ కుమార్‌, ఏఈ శివప్రసాద్‌, శానిటేషన్‌ డీఈ శ్రీనివాస్‌ తదితర అధికారులతో కలిసి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ సమస్యలను అధికారులకు వివరించారు. జవహర్‌నగర్‌, కృష్ణానగర్‌ తదితర కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ పనులను అధికారులకు వివరించారు. అనంతరం డీసీ సమ్మయ్య స్పందిస్తూ.. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలలో సీరియల్‌ నటుల సందడి



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న చిన్ని, కావేరి

రసూల్‌పురా : కంటోన్మెంట్‌ మడ్‌ఫోర్ట్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్టార్‌మాలో జూలై ఒకటి నుంచి ప్రసారం కానున్న నూతన సీరియల్‌ నటి చిన్ని, ఆన్‌ స్క్రీన్‌ తల్లి పాత్ర నటి కావేరి శుక్రవారం సందడి చేశారు. చిన్ని, కావేరి పాఠశాల విద్యార్థులతో ఆడి పాడారు. విద్యార్థులకు తల్లి, బిడ్డ అంశంపై డ్రాయింగ్‌ పోటీలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలతో షో నిర్వహించారు. అనంతరం ఐదు వందల మంది విద్యార్థులకు చిన్ని పేరుతో స్కూల్‌ బ్యాగు లు అందజేశారు. డ్రాయింగ్‌ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు చిన్ని బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం షఫ్రక్‌, ఉపాధ్యాయులు ఇందిర, ఉమాపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీ సేవలు ఎనలేనివి



సనత్‌నగర్‌: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు యావత్‌ ప్రపంచం గుర్తుంచుకునేలా జాతి అభ్యుదయానికి కృషి చేశారని పీవీ తనయ, ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్‌ కమిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్‌ విజయ సోమరాజు, స్వామి రామానందతీర్థ రీసెర్చ్‌ కమిటీ అధ్యక్షుడు పీవీ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. కల్యాణలక్ష్మి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్‌ : పేదింటి ఆడపడుచుల వివాహాలకు కల్యాణలక్ష్మి ఒక వరమని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద బేగంపేట డివిజన్‌కు చెందిన 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి సీఎం కేసీఆర్‌ నాయకత్వంలోని ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెరుగైన వైద్యం పొందాలి

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ కోరారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద బేగంపేటకు చెందిన లక్ష్మి వైద్య చికిత్స కోసం రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ, రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన అభిషేక్‌ అనే బాలుడి వైద్యం కోసం మంజూరైన రూ.50 వేల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్పొరేటర్‌ మహేశ్వరి, బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీహరి, ఆరిఫ్‌, శేఖర్‌, ఆకుల హరికృష్ణ, అరుణ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్‌ అందజేత



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు



నోట్‌బుక్స్‌ అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

అడ్డగుట్ట : కాంగ్రెస్‌ పార్టీ సికింద్రాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తుకారాంగేట్‌ ఎంసీహెచ్‌ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో ఆదం భరత్‌, గంట రాజుసాగర్‌, కృష్ణ, అంజయ్య, భూపతి హరి, అనంత కృష్ణారావు, రాము, నవీన్‌, ప్రభాకర్‌, రమేష్‌, సాయి పాల్గొన్నారు.

లాలాపేట: జన్మదినం సందర్భంగా కాంగ్రెస్‌ తార్నాక డివిజన్‌ పార్టీ నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. లాలాపేట విజయ డెయిరీ క్వార్టర్స్‌లోని సీతాఫల్‌మండి–2 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చాక్లెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ పార్టీ సిటీ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ చింతల్‌ కిట్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌ పుస్తకాలను అందజేశారు. కాంగ్రెస్‌ పార్టీ తార్నాక డివిజన్‌ అధ్యక్షుడు బ్రహ్మాజీ, సాగర్‌, రవి, శ్రీనివాస్‌, అర్జున్‌, తదితరులున్నారు.

సలీమ్‌ సేవలు అభినందనీయం



సలీమ్‌ను సన్మానిస్తున్న రాజారావు, వైద్యులు

గాంధీ ఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీ మార్చురీలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించిన మార్చురీ అసిస్టెంట్‌ మహ్మద్‌ సలీమ్‌ అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. గాంధీ ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ అండ్‌ ట్యాక్సికాలజీ విభాగంలో శుక్రవారం మహ్మద్‌ సలీమ్‌ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాత గాంధీ ఆస్పత్రి నుంచి ఇప్పటి వరకు నలభై రెండేళ్ల పాటు మార్చురీలో సేవలు అందించడం గొప్ప విషయమని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రాజారావు అన్నారు. 50 వేలకు పైగా పోస్టుమార్టం ప్రక్రియలు సలీమ్‌ చేతుల మీదుగా జరిగాయని ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ హెచ్‌ఓడీ కృపాల్‌సింగ్‌ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ లావణ్య కౌశిల్‌, ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ వైద్యులు, వైద్య విద్యార్థులు, మార్చురీ సిబ్బంది పాల్గొన్నారు.